సామాజికం.. ప్రజల పక్షం...

10 Anniversary Celebration
www.tmedia.net.in

మెయిన్

# టీ-మీడియా

సంపుటి : 8
సంచిక : 173
పేజీలు : 3

ఆదివారం 18 జనవరి, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ




## టీ మీడియా దినపత్రిక నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**టీ మీడియా,జనవరి 17,ముస్త్యాల:**

పెద్దపల్లి జిల్లా ముస్త్యాల గ్రామంలో టీ మీడియా దినపత్రిక నూతన 2026 సంవత్సర క్యాలెండర్‌ను గ్రామ సర్పంచ్ సుంకరి మహేందర్, గ్రామ ఉప సర్పంచ్ బాసినేని వినోద సత్యనారాయణ రావు మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆసియా నిషాత్ శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టీ మీడియా దినపత్రిక దినదినాభివృద్ధి చెందుతూ ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువచ్చి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలతో మమేకమై విశ్వసనీయమైన వార్తలను అందిస్తూ నిరంతరం ముందుకు సాగాలని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీ మీడియా క్రైమ్ రిపోర్టర్ వినయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం ఉన్నతంగా ఉండాలి



- విద్య మిమ్మల్ని ఉన్నతంగా నిలబెడుతుంది
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**టి మీడియా, జనవరి 17, జడ్చర్ల :**

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి. అందుకు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి. భాషను, జ్ఞానాన్ని పెంచుకోవడానికి చిత్తశుద్ధితో పనిచేయాలి. మీలోని నిబద్ధత, క్రమశిక్షణతో కూడిన విద్య మిమ్మల్ని సమాజంలో ఉన్నతంగా నిలబెడుతుంది." అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విద్యార్థినీ విద్యార్థులకు ఉద్బోధించారు. మహబూబ్ నగర్ జిల్లా జిల్లా జడ్చర్ల మండలం చిట్టబోయినపల్లిలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం కు భూమిపూజ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రస్తావించిన అంశాలపై ముఖ్యమంత్రి గారు స్పందించి, విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ఉజ్వలమైన భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థినీ విద్యార్థులందరికీ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ టాప్ ప్రాధాన్యంగా పెట్టుకున్నాం. అందుకే ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ లను ఏర్పాటు చేస్తున్నాం. మహబూబ్‌నగర్ జిల్లాలో ఐఐఐటీతో పాటు ఇంజినీరింగ్, లా, మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నాం. యూపీఎస్సీ (సివిల్స్) రాసేవారిని ప్రోత్సహించేందుకు మెయిన్స్, ఇంటర్వ్యూలకు ఎంపికైన యువతకు ఆర్థిక సహాయం అందిస్తున్నాం. ఇవన్నీ ప్రపంచంతో పోటీ పడాలన్న ఉద్దేశంతో చేస్తున్నాం. ఎంత ఎదిగినా కన్న తల్లిదండ్రులను, పుట్టిన ఊరును మరవకండి. రేపటి మీ భవిష్యత్తు చదువుపైనే ఆధారపడి ఉంది. 25 ఏళ్ల వరకు కష్టపడి చదువుకోండి. చదువు



మీకు సమాజంలో గౌరవాన్ని తెచ్చిపెడుతుంది. దేశంలో ఏ మూలకు వెళ్లినా తెలంగాణకు గుర్తింపు, గౌరవం తీసుకురావాలి. లక్ష్యాన్ని సాధించి సమాజానికి ఆదర్శవంతంగా నిలవాలి. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు జమీందార్లు, జాగీర్దార్ల వద్ద ఉన్న భూములను తీసుకుని భూమిలేని నిరుపేదలకు అసైన్‌మెంట్ లేదా పోడు భూముల పట్టాలను ఇచ్చారు. పేదలకు పంచేందుకు ఇప్పుడు భూములు లేవు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలంటేనే కష్టమైన పనిగా మారింది. ప్రభుత్వం ఇవ్వగలిగింది విద్య మాత్రమే. విద్య ఒక్కటే మీ జీవితాన్ని మార్చగలదు. అభివృద్ధి చెందిన పౌరులుగా నిలదొక్కుకోగలుగుతారు. అందుకే ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించగా, 75 ఏళ్ల తర్వాత మళ్లీ జిల్లాకు అవకాశం వచ్చింది. 2006లో జిల్లా పరిషత్ సభ్యుడి నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీగా చట్టసభల్లో పనిచేసిన నాకు పెద్దల సహకారంతో ముఖ్యమంత్రిగా అయ్యే అవకాశం లభించింది.." అని వివరిస్తూ, ఈ రోజు భూమిపూజ చేసుకున్న ఐఐఐటీ భవన నిర్మాణాన్ని ఏడాది కాలంలో పూర్తి చేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి స్పందించడానికి ముందు పలువురు విద్యార్థినీ విద్యార్థులు ఎలాంటి తొణుకు--బెణుకు లేకుండా అద్భుతంగా మాట్లాడారు. 200 కోట్ల రూపాయలతో నిర్మించే ఈ ఐఐఐటీ భూమిపూజ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ గారు, జూపల్లి కృష్ణారావు గారు, వాకిటి శ్రీహరి గారు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి , ఎంపీలు మల్లు రవి , డీకే అరుణ , ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

## మున్సిపల్ ఎన్నికల

# రిజర్వేషన్లు ఖరారు

### 10 కార్పొరేషన్లలో 5 మహిళలకు




**టి మీడియా, జనవరి 17, హైదరాబాద్ బ్యూరో :**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అత్యంత కీలకమైన అంకం పూర్తయింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లను ప్రభుత్వం అధికారికంగా ఖరారు చేసింది. మొత్తం 10 కార్పొరేషన్లలో 5 మహిళలకు కేటాయించడం ద్వారా మహిళా ప్రాతినిధ్యానికి పెద్దపీట వేశారు. ప్రధాన నగరాల్లో మేయర్ పదవుల రిజర్వేషన్లు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ జనరల్ మహిళకు కేటాయించడం గమనార్హం.

**కార్పొరేషన్ రిజర్వేషన్ కేటగిరీ**

జీహెచ్ఎంసీ -జనరల్ మహిళవరంగల్ -- జరనల్నల్గొండ, ఖమ్మం, నిజామాబాద్జనరల్(మహిళ) మహబూబ్‌నగర్ -- బీసీ మహిళమంచిర్యాల, కరీంనగర్ -- బీసీరామగుండం -- ఎస్సీకొత్తగూడెం -- ఎస్టీమున్సిపాలిటీల్లో బీసీల జోరురాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీ రిజర్వేషనర్లలో బీసీలకు పెకద్దపీట వేశారు. మొత్తం బీసీలకు 38 మున్సిపాలిటీలు కేటాయించారు. ఇందులో బీసీ మహిళలకు 19 కేటాయించింది. బీసీ మహిళలకు రిజర్వ్ అయిన కొన్ని ప్రధాన మున్సిపాలిటీలలో.. ఇల్లందు, జగిత్యాల, కామారెడ్డి, బాన్సువాడ, మెదక్, ములుగు, దేవరకొండ, గజ్వేల్, దుబ్బాక, పరిగి, నర్సంపేట, కాగజ్ నగర్, దేవరకద్ర, చెన్నూరు, కొల్లాపూర్, అచ్చంపేట, ఆలేరు, ఆత్మకూరు, కొత్తకోట ఉన్నాయి. జనగాం, భూపాలపల్లి, నాగర్ కర్నూలు, తాండూరు, హుజూర్ నగర్, సిద్దిపేట సహా మరికొన్ని మున్సిపాలిటీలు బీసీ జనరల్ ఉన్నాయి.

**రాజకీయ సమీకరణాలు మార్చనున్న రిజర్వేషన్లు**

ఈ రిజర్వేషన్ల ప్రకటనతో ఆయా నియోజకవర్గాల్లోని రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోనున్నాయి. 50 శాతం రిజర్వేషన్ల అమలుతో మున్సిపల్ పీఠాలపై మహిళల ఆధిపత్యం పెరగనుంది. రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన చోట అభ్యర్థులు ఇప్పటికే ప్రచారానికి సిద్ధమవుతుండగా, అనుకూలించని చోట తమ అనుచరులను లేదా కుటుంబ సభ్యులను రంగంలోకి దించేందుకు నేతలు ప్లాన్ చేస్తున్నారు.


**బీసీ ఓటు బ్యాంక్**

బీసీలకు గణనీయమైన సంఖ్యలో మున్సిపాలిటీలు కేటాయించడం ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపనుంది. ఓటర్ల జాబితా కూడా సిద్ధం కావడంతో ఒకటి, రెండు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. దీంతో తెలంగాణ పురవీధులన్నీ ఎన్నికల ప్రచారంతో హోరెత్తనున్నాయి.

## చొరబాటుదారులను

# ఓటర్లుగా మారుస్తోంది

### ప్రధాని మోదీ



**టీ మీడియా, జనవరి 17 ,కోల్‌కతా :**

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమతా బెనర్జీనేతృత్వంలోని ప్రభుత్వం విఫలమైందని ప్రధాని మోదీవిమర్శించారు. బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. పశ్చిమబెంగాల్ పర్యటనలో ప్రధాని మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే బీజేపీ ప్రభుత్వం కొలువుదీరాల్సిన అవసరం ఉందన్నారు.దేశ ప్రజలు ముఖ్యంగా జెన్-జీ కూడా బీజేపీ అభివృద్ధి నమూనాను విశ్వసిస్తున్నారని ప్రధాని చెప్పారు. మాల్దా సభలో ప్రసంగించిన ఆయన.. బీహార్‌లో ఎన్డీఏ విజయం సాధించిందని, ఇక బెంగాల్‌కు సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ సందర్భంగా బెంగాల్‌కు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.బెంగాల్‌కు అతిపెద్ద సవాల్ చొరబాట్లేనని, వీటి కారణంగానే మాల్దా, ముర్షీదాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతున్నాయని ప్రధాని చెప్పారు. చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జనాభా వర్గీకరణలోనూ మార్పు వచ్చిందని అన్నారు. వీటిని అరికట్టడానికి టీఎంసీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని దుయ్యబట్టారు. పైగా చొరబాటుదారులను ఓటర్లుగా మారుస్తోందని విమర్శించారు.రాష్ట్రానికి వరద సహాయ నిధులను 40 సార్లు అందించామని, అయినా అవి అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధాని మోదీ చెప్పారు. రాష్ట్రవాటాగా దక్కే కేంద్ర నిధులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొడుతోందని ఆరోపించారు. ఆ పార్టీ అవినీతి, హింస, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే పార్టీ అని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు

## గ్రీన్ అమ్మోనియా

# పెనుమార్పునకు నాంది

### సీఎం చంద్రబాబు

**టీ మీడియా, జనవరి 17, కాకినాడ :**

గ్రీన్ అమ్మోనియా భవిష్యత్తులో పెనుమార్పునకు నాంది పలుకుతుందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ శంకుస్థాపన చేశారు. రూ.18 వేల కోట్లతో నిర్మించనున్న గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు ద్వారా ఏటా 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరగనుంది. 1950 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్‌ను ఉత్పత్తి చేయనున్న ఏఎమ్ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుతో 8 వేల మందికి ఉద్యోగావకాశలు లభించనున్నాయి. దేశంలోనే అతిపెద్ద పర్యావరణహిత పరిశ్రమల్లో ఒకటిగా ఇది నిలవనుంది.ఎంత ఎత్తుకు ఎదిగినా స్వగ్రామాన్ని మరిచిపోకూడదని, మన సంస్కృతిని కాపాడుకుంటూనే టెక్నాలజీని వాడుకోవాలని చంద్రబాబు అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ ఇది. ఇక్కడ 2027 జూన్ నాటికి మొదటి ఉత్పత్తి ప్రారంభం అవుతుంది. ఆలోచనలను ఆచరణలో పెట్టేవారు చాలా కొద్దిమందే ఉంటారని వారిలో చలమలశెట్టి అనిల్ ఒకరు. చరిత్రను తిరగరాయడంలో తెలుగువాడు ముందున్నందుకు గర్వంగా ఉంది.బొగ్గు వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటోందన్న చంద్రబాబు కాలుష్యం వల్ల సముద్రంలోనూ పెనుమార్పులు వస్తున్నాయన్నారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి బాగా పెంచాలని ప్రధాని మోదీ కోరుతున్నారని, 2014లోనే మా ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీకి నాంది పలికిందన్నారు. 2024లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాకు నాంది పలికామని సీఎం స్పష్టం చేశారు. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీని తయారు చేస్తామని చంద్రబాబు వెల్లడించారు.ఆనాడు ఎన్టీఆర్ చొరవతో నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీ వచ్చిందని, ఇప్పుడు గ్రీన్? అమ్మోనియా పరిశ్రమ వచ్చిందని అన్నారు. సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌లో 20 పోర్టులు వస్తున్నాయని, ప్రపంచంలో ఎండ పుష్కలంగా ఉండే దేశం మనదే అని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి ఏపీ అనుకూలమని అన్నారు. గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ మన రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కానుందన్నారు. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ మన రాష్ట్రానికి వరం అని తెలిపారు. కాకినాడ గురించి భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా చర్చించుకుంటారని అన్నారు. ఇలాంటి పరిశ్రమలకు అనుకూలమైన పరిస్థితులన్నీ ఇక్కడ ఉన్నాయని తెలిపారు. ప్రజలకు మేలు జరిగే ఆలోచనలను వెంటనే అమలు చేస్తామని, 2047 నాటికి మన రాష్ట్రం స్వర్ణాంధ్రగా తయారవుతుందని వెల్లడించారు.

గ్రీన్ అమ్మోనియా వల్ల వ్యవసాయరంగానికి చాలా మేలు జరుగుతుందన్న చంద్రబాబు ప్రకృతి సేద్యం పెరగడమే అందరి ఆరోగ్యాలకు శ్రీరామ రక్ష అని తెలిపారు. ఎరువులు,




పురుగుమందుల వినియోగం బాగా తగ్గించాలని సూచించారు. గ్రీన్ అమ్మోనియాను ఏ దేశానికైనా ఎగుమతి చేసే అవకాశం ఉందని అన్నారు.యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని చంద్రబాబు వెల్లడించారు. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో ఏపీకే 25 శాతం వచ్చాయని, ఇటీవల రూ.8.75 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు. ఏపీకి ఉన్న అన్ని రకాల వనరులను ఉపయోగించుకుంటున్నామన్నారు. డ్రోన్ ట్యాక్సీలు రావాల్సిన అవసరం ఉందని, రోడ్లపై వాహనాల రద్దీ తగ్గాలని అన్నారు. ఏపీలో ఈ ఏడాదే డ్రోన్ అంబులెన్స్ కూడా ప్రారంభిస్తామని తెలిపారు. మన రాష్ట్రానికి డేటా సెంటర్లు, రోబోటిక్స్ వస్తున్నాయని, నాలెడ్జ్ ఎకానమీలో ముందున్నవారే విజేతలు అవుతారని సూచించారు. రాష్ట్రం నుంచి వందల మంది పారిశ్రామికవేత్తలు తయారుకావాలని ఆకాంక్షించారు.

**పర్యావరణాన్ని రక్షించుకుంటూ ముందుకు**

బలమైన సంకల్పం ఉంటేనే ఏదైనా సాధించగలమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అనేక కష్టనష్టాలను తట్టుకుని ఏఎం గ్రీన్ కంపెనీ పెట్టారని, చలమలశెట్టి అనిల్, మహేశ్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఏఎం గ్రీన్ కంపెనీ 495 ఎకరాల్లో ఏర్పాటు కానుందని, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ముందుకెళ్తున్నామని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ దిశగా మనం వేసే అడుగులు చాలా కీలకమని అన్నారు. క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని వెల్లడించారు.కాలుష్యరహిత ఇంధన ప్రయాణంలో ఇదో మైలురాయి అని, రాష్ట్ర సుస్థిరాభివృద్ధిలో ఇది గేమ్ ఛేంజర్ కానుందని పవన్? స్పష్టం చేశారు. వివిధ రంగాల్లో కార్బన్ ఎమిషన్స్‌ను పెద్దస్థాయిలో తగ్గిస్తోందని, భూతాపం తగ్గించేందుకు గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు దోహదం చేస్తాయని తెలిపారు. గత ప్రభుత్వం విదేశీ పెట్టుబడిదారులను అనేక ఇబ్బందులు పెట్టిందని, కానీ తమ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అండగా ఉంటుందని వెల్లడించారు. యువతకు ఉద్యోగాల కల్పనకు ఉన్న అవకాశాలు వాడుకుంటున్నాని స్పష్టం చేశారు.

## శివసేన మళ్లీ

# చీలిపోతుంది

### షిండే రిసార్ట్ పాలిటిక్స్‌పై ఉద్ధవ్ ఠాక్రే



**టీ మీడియా, జనవరి 17 ,ముంబై:**

మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) ఎన్నికల్లో ఠాక్రేల ఆధిపత్యానికి గండికొడుతూ.. 25 ఏళ్ల తర్వాత బీజేపీంషిండే శివసేన సత్తా చాటాయి. 227 స్థానాలు ఉన్న ముంబైలో మెజారిటీ మార్క్ 114. బీజేపీ 89 స్థానాలు సాధించగా, షిండే శివసేన 29 స్థానాల్లో గెలిచింది. ఈ రెండు పార్టీలు కలిస్తే మొత్తం సంఖ్య 118, ఇది మెజారిటీ మార్కును సులభంగా దాటుతుంది. అయితే, ఇక్కడే షిండే సేన "కింగ్ మేకర్ణ' స్థానంలో నిలిచింది. తమకే ముంబై మేయర్ పీఠం కావాలని బీజేపీపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో శివసేన యూబీటీ నేత ఉద్ధవ్ ఠాక్రే సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఏక్‌నాథ్ షిండే తన కార్పొరేటర్లను ఫైవ్-స్టార్ హోటల్‌లో ఉంచారు కాబట్టి అతను బీజేపీకి భయపడుతున్నాడు. వారు ఒకసారి చీలిపోయినప్పుడు, మళ్లీ చీలిపోగలరని అతనికి తెలుసు" అని అన్నారు. 2022లో శివసేన రెండుగా చీలిపోయింది. ఆ సమయంలో 40 మంది ఎమ్మెల్యేలు షిండేకు మద్దతుగా నిలిచారు. ఈ పరిణామాల తర్వాత శివసేనంకాంగ్రెస్ంఎన్సీపీ ప్రభుత్వం పడిపోయి, బీజేపీ ం షిండే శివసేన అధికారాన్ని ఏర్పాటు చేశాయి. షిండే శివసేన కార్పొరేటర్లు "రిసార్ట్ పాలిటిక్స్ణ' మొదలుపెట్టిన నేపథ్యంలో ఉద్ధవ్ నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. 29 మంది శివసేన కార్పొరేటర్లు ముంబైలోని తాజ్ ల్యాండ్స్ ఎండ్ హోటల్‌కు వెళ్లారు. ఈ ఎన్నికల్లో ఉద్ధవ్ ఠాక్రే శివసేన, రాజ్ ఠాక్రే ఎంఎన్ఎస్ పార్టీలు కలిసి పోటీ చేశాయి. 71 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ముంబైలోని మరాఠా ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ఈ కూటమి సత్తా చాటింది. తమ పట్టును నిలుపుకుంది.ముంబైలో తమ మేయర్ ఉండాలన్నదే తమ కల అని, కానీ సంఖ్యా బలం తమకు అనుకూలంగా లేదని ఉద్ధవ్ చెప్పారు. బీజేపీ కాగితంపై శివసేనను అంతం చేయగలదు కానీ, క్షేత్రస్థాయిలో కాదని అన్నారు. కానీ బీజేపీ కాగితాలపైనే కనిపిస్తోందని, క్షేత్రస్థాయిలో లేదని అన్నారు. ఫిరాయింపుదారుల్ని వారి వైపు తిప్పుకోవడానికి మహాయుతి ప్రభుత్వం దుర్వినియోగాలకు పాల్పడిందని, అధికారం, డబ్బు, బెదిరింపులకు పాల్పడిందని ఠాక్రే ఆరోపించారు. మా సభలకు భారీగా జనాలు వచ్చారని, బీజేపీ కార్యక్రమాల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయని, అయినా వారికి అన్ని సీట్లు ఎలా వచ్చాయని అనుమానాలు ఉన్నాయని అన్నారు.



## తొలి వందే భారత్

# స్లీపర్ రైలు ప్రారంభం

**టీ మీడియా, జనవరి 17 ,మాల్దా:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఉత్తర బెంగాల్‌లోని మాల్దా టౌన్ స్టేషన్ నుండి హౌరా, గువాహటి (కామాఖ్య) మధ్య నడిచే దేశపు తొలి వందే భారత్ స్లీపర్ రైలునుజెండా ఊపి ప్రారంభించారు. గౌహతి--హౌరా వందే భారత్ స్లీపర్ రైలును వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. మోదీ రైలు లోపల పిల్లలు, పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. ఆధునిక భారతదేశంలో పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చడానికి అభివృద్ధి చేయబడిన పూర్తిగా ఏసీ వందే భారత్ స్లీపర్ రైలు ప్రయాణీకులకు తక్కువ ఛార్జీలతో ఎయిర్‌లైన్ లాంటి ప్రయాణ అనుభవాన్ని అందిస్తుందని పీఎంఓ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. తరువాత మాల్దాలో జరిగే ఒక బహిరంగ కార్యక్రమంలో, బెంగాల్, ఈశాన్య రాష్ట్రాలలో కనెక్టివిటీని బలోపేతం, అభివృద్ధిని వేగవంతం చేయడానికి ఉద్దేశించిన, రూ. 3,250 కోట్ల విలువైన పలు రైలు, రహదారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు.

# సంక్రాంతి రిటర్న్ జర్నీ ఎఫెక్ట్

## • హైదరాబాద్ వెళ్లే వాహనాలు దారి మళ్లింపు

**టీ మీడియా, జనవరి 17, అమరావతి :**

సంక్రాంతి పండగ ముగియడంతో మళ్లీ తిరుగు ప్రయాణాలు ప్రారంభమయ్యాయి. పండగకు వివిధ ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చిన ప్రజలు మళ్లీ తిరుగుముఖం పడుతున్నారు. ప్రయాణికుల తిరుగు ప్రయాణం రద్దీ మూలంగా విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ కిటకిటలాడుతుంది.సాయంత్రం నుంచి రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. విజయవాడ బస్ స్టేషన్?లో సరిపడా బస్సులు లేక ప్రయాణికులు పడిగాపులు పడుతున్నారు. రైల్వే రిజర్వేషన్లు ఎప్పుడో నిండిపోవడంతో ప్రత్యామ్నాయంగా బస్సుల వైపు చూస్తున్నారు. బస్సుల్లో కూడా అదే పరిస్థితి కనిపిస్తుంది. హైదరాబాద్ వంటి ప్రాంతాలకు సరిపోయే బస్సులు లేక ప్యాసింజర్ సర్వీసులనే బోర్డులు మార్చి హైదరాబాద్?కు పంపుతున్నారు. తిరుగు ప్రయాణికులతో గొల్లపూడి బైపాస్ వద్ద కూడా పరిస్థితి రద్దీగా మారింది. వేలాది వాహనాలు హైదరబాద్ బాట పట్టాయి. రేపటికి వాహనాల తాకిడి ఇంకా పెరిగే అవకాశం ఉంది.



**పెరిగిన వాహనాల తాకిడి**

పండగ సెలవుల అనంతరం హైదరాబాద్ వెళ్లేవారితో హైదరాబాద్-విజయవాడ రహదారి రద్దీగా మారింది. ఉదయం నుంచి వాహనాల తాకిడి ప్రారంభం కాగా, మధ్యాహ్నానికి వాహనాల సంఖ్య మరింత ఎక్కువగా పెరిగింది. సాయంత్రానికి కార్లతో వెళ్లే వారి సంఖ్య పెరగనుంది. విజయవాడ శివారు గొల్లపూడి బైపాస్ రోడ్డు వద్ద కూడా వాహనాల రద్దీ పెరిగింది.హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద నెమ్మదిగా వాహనాలు కదులుతున్నాయి. అదే విధంగా చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల వద్ద సైతం వాహనాల తాకిడికి నెమ్మదిగానే కదులుతున్నాయి. చిట్యాల, పెద్దకాపర్తి వద్ద కిలోమీటరు మేర వాహనాలన్నీ బారులు తీరాయి.దారి మళ్లింపు: గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను పోలీసులు దారి మళ్లిస్తున్నారు. గుంటూరు-మిర్యాలగూడ-హాలియా-చింతపల్లిమాల్ మీదుగా, మాచర్ల-సాగర్-పెద్దవూర-చింతపల్లి-మాల్ మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తున్నారు. నల్గొండ-మర్రిగూడ బైపాస్-మునుగోడు-నారాయణపూర్- చౌటుప్పల్ మీదుగా, కోదాడ-హుజూర్‌నగర్-మిర్యాలగూడ-హాలియా-చింతపల్లి మాల్ మీదుగా, హైవేపై పరిస్థితి మేరకు చిట్యాల నుంచి భువనగిరి మీదుగా మళ్లింపు చేస్తుండటం గమనార్హం. టోల్‌గేట్లు, ఇతరచోట్ల వాహనాల రద్దీని పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నారు. ట్రాఫిక్ పరిస్థితిపై సైతం డ్రోన్, సీసీ కెమెరాలతో అధికారులు నిరంతర పర్యవేక్షిస్తున్నారు. సంక్రాంతి రద్దీ నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. పండుగ పూర్తయిన తర్వాత ఏపీ నుంచి హైదరాబాద్? వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ఎన్?హెచ్?-65 విస్తరణ పనుల దృష్ట్యా ట్రాఫిక్? ఆంక్షలు విధించారు. చిట్యాల, పెద్దకాపర్తి, కొర్లపహాడ్, పంతంగి టోల్?ప్లాజాల వద్ద ట్రాఫిక్? జామ్? అయ్యే అవకాశాలు అధికంగా ఉండటంతో పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నారు. గుంటూరు నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. గుంటూరు-మిర్యాలగూడ-హాలియా-చింతపల్లి-మాల్? మీదుగా హైదరాబాద్?కు వాహనాల మళ్లింపు చేపట్టారు. మాచర్ల-సాగర్-పెద్దవూరు-చింతపల్లి-మాల్? మీదుగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు.విజయవాడ నుంచి వచ్చే భారీ వాహనాలు కోదాడ-మాల్ మీదుగా హైదరాబాద్?కు మళ్లిస్తున్నారు. ఎన్?హెచ్?-65పై ట్రాఫిక్? జామ్? ఏర్పడితే చిట్యాల నుంచి భువనగిరి మీదుగా వాహనాలను దారి మళ్లించనున్నారు. డ్రోన్? కెమెరాలు, సీసీ టీవీలతో ట్రాఫిక్? పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.ఈ సంవత్సరం సంక్రాంతి పండుగను సొంతూళ్లో ఎంతో ఆనందంగా జరుపుకున్నాం. మన సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పే విధంగా ఈ పండుగలనేవి మన జీవితంలో అంతర్భాగమయ్యాయి. బస్సులకు కొద్దిమేర కొరత ఏర్పడినప్పటికీ ప్రయాణం కాస్త సౌకర్యంగానే ఉంది. అంతేకాకుండా మౌలిక సౌకర్యాలు సైతం అందుబాటులో ఉన్నాయి" -ప్రయాణికులు

మరికొన్ని సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లిన వారికి తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు లేకుండా అదనపు బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. హైదరాబాద్ నుంచి కోదాడ, సూర్యాపేట, నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, మహబూబ్‌నగర్, అచ్చంపేట, నారాయణపేట, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, ఏలూరు మొదలైన ప్రాంతాలకు 1200 బస్సులు నడిపింది.ఏపీలోని విశాఖపట్టణం, రాజమహేంద్రవరం, కాకినాడ, భీమవరం, విజయవాడ, నెల్లూరు నుంచి 18న వచ్చే సాధారణ బస్సుల్లో దాదాపు సీట్లు లేవు. ఆయా జిల్లాల నుంచి హైదరాబాద్‌కు నడుపుతున్న బస్సుల్లో 'ప్రత్యేక' ఛార్జీల మోత తప్పడం లేదు. రంగారెడ్డి రీజియన్ నుంచి విజయవాడ, అమలాపురం, రాజమండ్రి, కాకినాడ, ఒంగోలు, కందుకూరు, కనిగిరి, కర్నూలు ప్రాంతాలకు సాధారణ రోజుల్లో 300 బస్సులు నడుపుతుండగా సంక్రాంతి నేపథ్యంలో 200 అదనంగా నడిపినట్టు రంగారెడ్డి ఆర్టీసీ అధికారులు తెలిపారు.



## రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

**• ఎస్సై అశోక్ రెడ్డి, ఏఎస్ఐ కరుణాకర్**

**టీ మీడియా, జనవరి 17 ,సుల్తానాబాద్:**

రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఎస్సై అశోక్ రెడ్డి, ఏఎస్ఐ కరుణాకర్ అన్నారు. రోడ్డు భద్రత అవగాహన సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చిన్న వయస్సు నుంచే రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.అలాగే నాలుగు చక్రాల వాహనాలు నడిపేటప్పుడు సీటు బెల్ట్ ధరించడం ఎంతో అవసరమని సూచించారు.

వేగ నియంత్రణ పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పకుండా పాటించాలని విద్యార్థులకు వివరించారు.డ్రాయింగ్ పోటీల ద్వారా విద్యార్థులు రోడ్డు భద్రతపై చక్కటి సందేశాలను చిత్రాల రూపంలో తెలియజేశారని ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మునిందర్, అలీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ ఉత్సాహం

**టీ మీడియా ,జనవరి 17, టేక్మాల్ ప్రతినిధి:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోనిరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామీణ క్రీడలను పెంపొందించడానికి సీఎం కప్ ద్వారా మండల కేంద్రాలలో టార్చర్ ర్యాలీ సందర్భంగా మండల కేంద్రమైన టేక్మాల్ లో చౌరస్తా నుండి జిల్లా పరిషత్ మైదానం వరకు పెద్ద ఎత్తున టార్చి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ తులసిరామ్ ఎంపీడీవో రియాజుద్దీన్ ఎంఈఓ సుజాత మేడం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఉప సర్పంచ్ శంకరయ్య మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నిమ్మ రమేష్, టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బత్తుల వీరప్ప మెదక్ జిల్లా మైనారిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ షేక్ మజార్, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య ,టిఆర్ఎస్ నాయకులు నాయకోటి భాస్కర్ ,సర్పంచులు సక్రు నాయక్ , రంగలాల్ , టౌన్ ప్రెసిడెంట్ బత్తుల కిషోర్ , జోగిపేట్ మార్కెట్ కమిటీ రాజేష్ గౌడ్, సంగమేష్ ,ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి మహేష్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ నాయకోటి సుభాష్ ,మాజీ యువజన సంఘాల ప్రతినిధులు నైకోటి భాస్కర్ గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లు, భోగం వీరేశం,



సాయి శేషు గౌడ్ , వెంకటేశం, ఉపాధ్యాయులు యువకులు జర్నలిస్టులు పెద్ద ఎత్తున కార్యక్రమం విజయవంతం చేశారు.

# అత్యంత పారదర్శకంగా రిజర్వేషన్ల ఖరారు

**• జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**టీ మీడియా, జనవరి 16,వనపర్తి,:**

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, సీప్-2024 సర్వే ఆధారంగా మున్సిపల్ ఎన్నికలకు వార్డుల వారీగా రిజర్వేషన్లను అత్యంత పారదర్శకంగా ఖరారు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన మున్సిపల్ వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేశారు.లాటరీ పద్ధతిలో మహిళా రిజర్వేషన్ల ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, సీప్-2024 సర్వే జనాభా ప్రతినిధ్య ప్రాతిపదికన మున్సిపల్ ఎన్నికలకు వార్డుల వారీ రిజర్వేషన్లను అత్యంత పారదర్శకంగా ఖరారు చేయడం జరిగిందని తెలిపారు.నిబంధనల ప్రకారం వనపర్తి, కొత్తకోట, పెబ్బేరు, ఆత్మకూరు, అమరచింత మున్సిపాలిటీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కేటగిరీలలో మహిళలకు కేటాయించాల్సిన వార్డులను లక్కీ డ్రాద్వారా ఎంపిక చేశామన్నారు. రిజర్వేషన్ల ఖరారు అనంతరం గెజిట్ విడుదల చేసి, తదుపరి జాబితా ప్రతులను కలెక్టరేట్ మరియు సంబంధిత మున్సిపల్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్లు, వివిధ రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులు, ప్రతినిధులు ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



## గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా రాజేశం ఎన్నిక

**టీ మీడియా ,జనవరి 16 , మంథని:**

తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గౌరవ శ్రీ దుదిల్ల శ్రీధర్ బాబు గారి మరియు టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీ దుదిల్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆధ్వర్యంలో అడవి శ్రీరాంపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన శాఖ అధ్యక్షుడిగా దేశిని రాజేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కమాన్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, ముత్తారం మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు వాజీదు పాషా, గ్రామ సర్పంచ్ అన్నపూర్ణ ఉపేందర్, ఉప సర్పంచ్ అనవేనా హరిత తిరుపతి, వార్డు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు యూత్ కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నూతన అధ్యక్షుడు దేశిని రాజేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలని, గ్రామంలో కాంగ్రెస్‌ను మరింత బలపడేలా చేయాలని సూచించారు.



## ధూప దీప నైవేద్య పథకం పై దుష్ప్రచారం మానుకోవాలి

**టీ మీడియా, జనవరి 17 ,పెబ్బేరు :**

ధూప దీప నైవేద్య పథకం తో పాటు అర్చకుల పై పలువురు చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని వనపర్తి జిల్లా అధ్యక్షులు పీవీ లక్ష్మీకాంతచార్యులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరుట్ల మాధవమూర్తి ఒక ప్రకటన లో అన్నారు కొందరు అర్చకులు పెద్దమనుషులుగా ప్రచారం చేసుకుంటూ వారి ఉద్యోగ ధర్మాన్ని విస్మరిస్తూ దేవాదాయ కార్యాలయం పై పెత్తనం చేస్తున్నారని అన్నారు నిరంతరం వారి పబ్బం గడుపుకోవడం కొరకు ధూప దీప నైవేద్య పథకం పై దుష్ప్రచారం చేయడం జరుగుతున్నదని ప్రభుత్వం వారి ఆరోపణలు నిగ్గుతెల్చాలని సోషల్ అడిట్ కు ఆదేశించడాన్ని ధూప దీప నైవేద్య సంఘం స్వాగతిస్తున్నదని అన్నారు అర్చక సంఘం పై అధ్యక్ష కార్యవర్గం పై అసత్య ఆరోపణలు చేసే వారిపై సంఘం అంతే దురుసుగా ప్రవర్తిస్తుందని హెచ్చరించారు అర్చక కుటుంబాలు బాగుండాలనే ఉద్దేశంతో కీ శే గంగు భానుమూర్తి ఆలోచనతో సంఘం ఆవిర్భవించిందని తెలంగాణ ప్రజల క్షేమం కొరకు ధూప దీప నైవేద్య అర్చకుల సహకారంతో ప్రతి సంవత్సరం సంఘం ద్వారా యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహిస్తామని లోకాః సమస్తా సుఖినో భవంతు అన్న వేదసూక్తిని ఆధారంగా చేసుకొని సంఘం ముందుకు వెళ్తుందని పేర్కొన్నారుకరోనా సమయం లో కూడా తెలంగాణ ప్రజాక్షేమం కోరి ప్రభుత్వానికి అండగా సీఎం సహాయా నిధికి హితోధికంగా సహాయం చేసిన పెద్ద మనస్సు ధూప దీప నైవేద్య అర్చకులదని గ్రామీణ ప్రాంతాలలో దేవాలయ వ్యవస్త ను కాపాడటం కొరకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందని నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ డిడిఎన్ అర్చకులకు ఉద్యోగ భద్రత వేతన పెంపుదల చేస్తుందనే విశ్వాసం అర్చకులకు ఉన్నదని అన్నారు అర్చకులు ప్రభుత్వానికి అనుకూలంగా సమాజంలో మంచిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు తెలంగాణ ప్రభుత్వం సమాజం డిడియన్ అర్చకులకు సహకారంగా ఉండి గ్రామీణ ప్రాంతాల్లో అర్చక వ్యవస్థను కాపాడాలని విజ్ఞప్తి చేశారు గ్రామాల్లోని ప్రాచీన ఆలయాల ద్వారా సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుతున్న ధూప దీప నైవేద్య సంఘం అర్చకులపై ఆరోపణలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.



## పాలకవర్గ సమావేశం

**టీ మీడియా, జనవరి 17, ముదిగొండ**

మండలంలోని వెంకటాపురం గ్రామపంచాయతీలో పాలకవర్గం సమావేశం శనివారం గ్రామపంచాయతీలో నిర్వహించారు. ఈ సమావేశం పంచాయతీ కార్యదర్శి జి.స్రవంతి అధ్యక్షతన నిర్వహించగా సర్పంచ్ కందుల బాలచందర్, ఉపసర్పంచ్ రాయల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమం మీద చర్చించారు. సర్పంచ్‌గా గెలిచినటువంటి కందుల బాలచందర్ చేసిన/చేయవలసిన పనులు గురించి చర్చించారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి రంగులు వేయించడం, కొత్తగా నర్సరీ ఏర్పాటు, వీధి లైట్లు, వాటర్‌ట్యాంక్ గ్రౌండ్ శుభ్రపరచడం, అన్ని వార్డులలో డ్రైనేజీ శుభ్రపరచడం, కాలువ శుభ్రపరచడం, గ్రామ దీపికలకు ఆఫీస్ బిల్డింగ్ ఏర్పాటు చేయుట, బీసీ కాలనీలో వాటర్ ట్యాంక్ మరమ్మతులు చేయుట గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.





## మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం

**టీ మీడియా, జనవరి 16,మేడ్చల్:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని చంద్ర రెడ్డి గార్డెన్స్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సి.జి.ఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారుఈ సమావేశానికి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి గారు, బీఆర్ఎస్ పార్టీ నియమించిన ఇన్‌చార్జ్, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని విజయ పథంలో నడిపించేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం పోరాటం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, స్థానిక ఇన్‌చార్జులు ఆర్.సి.పురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్లు ఖరారు

**టీ మీడియా, జనవరి 17 ,సుల్తానాబాద్:**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా శనివారం రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. అధికారులు ప్రకటించిన ప్రకారం 15 వార్డులకు గాను రిజర్వేషన్లు వార్డుల వారిగా ఈ విధంగా ఉన్నాయి. సుల్తానాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ జనరల్ రిజర్వేషన్ అయింది.

**వార్డుల వారిగా రిజర్వేషన్లు...**

1వ వార్డ్ (బిసి మహిళా), 2వ వార్డ్ (జనరల్), 3వ వార్డ్ (జనరల్ మహిళా), 4వ వార్డ్ (జనరల్), 5వ వార్డ్ (బిసి మహిళా), 6వ వార్డ్ (జనరల్), 7వ వార్డ్ (ఎస్సి జనరల్), 8వ వార్డ్ (ఎస్టీ జనరల్), 9వ వార్డ్ (జనరల్), 10వ వార్డ్ (బిసి జనరల్), 11వ వార్డ్ (ఎస్సి మహిళా), 12వ వార్డ్ (జనరల్ మహిళా), 13వ వార్డ్ (బిసి జనరల్), 14వ వార్డ్ (జనరల్ మహిళా), 15వ వార్డ్ (జనరల్ మహిళా) రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. రిజర్వేషన్లు ఖరారు కావడంతో పోటీ చేయనున్న అభ్యర్థులు ఇప్పటినుండే ఓటర్లను కలుస్తూ అవకాశం ఇవ్వండి, అభివృద్ధి చేస్తామంటూ వేడుకుంటున్నారు...



## ఛలో పాలమూర్ బహిరంగ సభ

**టీ మీడియా ,జనవరి 17, పెబ్బేరు:**

పెబ్బేరు మున్సిపాలిటీ నుండి బయలు దేరిన 2వ వార్డ్ కాంగ్రెస్ నాయకులు వాహన శ్రేణికి జెండా ఊపి ప్రారంభించిన వెంకట్ రాములు యాదవ్ టౌన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మున్సిపల్ ఎన్నికల సన్నాక సమావేశంలో భాగంగా నేడు పాలమూరు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకుముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆదేశాల మేరకు సభకు పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 2 వ వార్డులలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొంతం దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు టౌన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు వెంకట్ రాములు యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ విజయ్ వర్ధన్ రెడ్డి జిల్లా యువజన నాయకులు రంజిత్ కుమార్ మాజీ కౌన్సిలర్ అశ్విని సత్యా నారాయణ నాయకులు యుగంధర్ రెడ్డి 2వ వార్డ్ అధ్యక్షులు గాడిముడి గణేష్,వార్డు ఇంచార్జ్ గంధం సునీల్ కుమార్ గిరి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**టీ మీడియా, జనవరి 17,మేడ్చల్:**

దుండిగల్ సర్కిల్ పరిధిలో, స్పెషల్ శానిటేషన్ లో భాగంగా గార్బేజ్ వనరబుల్ పాయింట్స్ గుర్తించి వాటిని శుభ్రపరచడం జరిగింది, అదేవిధంగా అన్ని వార్డుల యందు స్కూలు పిల్లలు రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, వార్డు ప్రముఖులతో స్వచ్ఛత పైన ప్రతిజ్ఞ చేయించడం జరిగింది, ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించటం తమ బాధ్యతగా గుర్తించాలని, మీ ఇంటి నుండి వచ్చే చెత్తను తడి చెత్త పొడి చెత్తగా వేరు చేసి మీ ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధించాలని, బహిరంగ మలమూత్ర విసర్జన చేయకూడదని పబ్లిక్ టాయిలెట్ లను వాడాలని, సూచించినారు, ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి. సాత్విక్, వార్డు జవాన్ లు, బహదూర్ పల్లి, గాగిలాపూర్, గవర్నమెంట్ స్కూల్ పిల్లలు, రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.





## రోడ్డు భద్రత వారోత్సవాల కార్యక్రమం

**టీ మీడియా, జనవరి 17,మేడ్చల్:**

డిప్యూటీ కమిషనర్ దుండిగల్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్ గండి మైసమ్మ చౌరస్తాలో జరిగే రోడ్డు భద్రత వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకట్ రెడ్డి, డిసిపి ఎన్ కోటిరెడ్డి , దుండిగల్ స్టేషన్ ఇన్స్పెక్టర్ బాల్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ త్రివేణి పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో పౌరులందరి చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది, డిప్యూటీ కమిషనర్ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించడం తమ విధిగా ఉండాలని, వెహికల్స్ నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, పౌరుల చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.

## ఎరైవ్ అలైవ్ కార్యక్రమం

**టీ మీడియా, జనవరి 17,చిన్నంబావి:**

చిన్నంబావి మండల కేంద్రంలో పెద్ద దగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని చిన్నంబావి మండల ఎస్సై. ఎ నాగరాజు, ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై ప్రత్యేక అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా నేటి బాలలే రేపటి పౌరులని విద్యార్థులు కుటుంబ సభ్యులకు, బంధువులకు, అవగాహన కల్పించాలని, స్కూల్, లో విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలను వెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత నియమాలను ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేమించి వాహ్వనం నడతనడపరాదని, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హై స్కూల్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# జల్లికట్టు వీరులకు ప్రభుత్వ ఉద్యోగమిస్తాం

- పశుసంవర్ధక శాఖలో అవకాశాలు
- ముఖ్యమంత్రి స్టాలిన్ వెల్లడి



**టీ మీడియా ,జనవరి 17, మధురై :**
తమిళనాడు సంప్రదాయ క్రీడ జల్లికట్టులో అసాధారణ ప్రతిభ కనబరిచిన వారికి సీఎం స్టాలిన్ గుడ్? న్యూస్ చెప్పారు. ఎక్కువ సంఖ్యలో ఎద్దులను లొంగదీసుకున్న క్రీడాకారులకు పశు సంవర్ధక శాఖలోని ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. జల్లికట్టు పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల శ్రమను గుర్తిస్తామన్నారు. పశుసంవర్ధక శాఖలో ప్రభుత్వ ఉద్యోగాల్లో వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. జల్లికట్టు ఎద్దుల ఆరోగ్యం, సంరక్షణ కోసం అలంగనల్లూర్‌లో రూ. 2కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్రత్యేక పశువైద్యశాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు.శనివారం మధురై జిల్లాలోని అలంగనల్లూర్?లో జల్లికట్టు పోటీలను సీఎం స్వయంగా వీక్షించారు. పోటీల్లో రాణించిన వారికి సీఎం స్వయంగా బహుమతులు అందజేశారు. అలాగే, జల్లి కట్టు క్రీడాకారులు లొంగదీయలేని ఎద్దుల యజమానులకు సీఎం స్టాలిన్ స్వయంగా బంగారు ఉంగరాలను అందించారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడారు. సంప్రదాయ తమిళ క్రీడ అయిన జల్లికట్టును ప్రత్యక్షంగా వీక్షించడం తనకు ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా జల్లికట్టు క్రీడకు, అందులో పాల్గొనే క్రీడాకారులకు మద్దతుగా రెండు కీలక నిర్ణయాలను ప్రకటించారు.

**ఎద్దుల జాతుల ఉనికిని కాపాడేందుకే జల్లికట్టు పోటీలు!**

జల్లికట్టు తమిళనాడుకు చెందిన శతాబ్దాల నాటి సంప్రదాయ క్రీడ. పొంగల్ పండుగలో మూడో రోజు దీనిని నిర్వహిస్తారు. తమిళనాడులోని స్థానిక ఎద్దుల జాతుల ఉనికిని కాపాడేందుకే జల్లికట్టు పోటీలను నిర్వహిస్తున్నట్లు జల్లికట్టు సంఘం అధ్యక్షుడు పి.రాజశేఖరన్ తెలిపారు. 2014లో జల్లికట్టుపై సుప్రీంకోర్టు బ్యాన్ విధించడంతో, ఈ ఎద్దుల జాతులు అంతరించిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని, ఆనాటి నుంచి చాలా మంది వాటిని పెంచడం ఆపేశారని పేర్కొన్నారు. ఆ ప్రతికూల పరిస్థితుల్లో తాము పలుచోట్ల జల్లికట్టు పోటీల్లో గెలిచిన యోధులకు ఎద్దు దూడలను బహుమతులుగా ఇచ్చామన్నారు. అయితే, 2016లో జల్లికట్టు కోసం తమిళులు తీవ్రస్థాయిలో ఉద్యమించారని, చివరకు రాష్ట్ర ప్రభుత్వమే చట్టాన్ని తీసుకొచ్చిందని ఆయన చెప్పారు. జల్లికట్టును చట్టపరంగా నిర్వహించుకునే వీలును కల్పించిందని, ఇప్పుడు తమ రాష్ట్రంలో ఎద్దుల ధరలు పెరిగాయని తెలిపారు. వాటిని పెంచే వారికి మంచి లాభాలు వస్తున్నాయని, ఒక్కో జల్లికట్టు ఎద్దు ధర లక్షల్లో పలుకుతోందని చెప్పారు.
ఇదిలా ఉండగా, గురువారం అవనియపురంలో జల్లికట్టు పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర మంత్రులు మూర్తి, పళనివేల్ త్యాగరాజన్ ఈ జల్లికట్టు పోటీలను ప్రారంభించారు. మదురైతో పాటు విరుధు నగర్, శివ గంగ, రామనాథపురం, థేనీ, దిండిగల్, తిరుచ్చి జిల్లాల నుంచి కూడా ఔత్సాహికులు తమ ఎద్దులతో అవనియపురానికి వచ్చారు. ప్రతీ గంటకు ఎంట్రీ గేటు నుంచి 80 నుంచి 90 ఎద్దులను జల్లికట్టు మైదానంలోకి వదిలేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ పోటీలను వీక్షించేందుకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. ప్రజల భద్రత దృష్ట్యా 2వేల మంది పోలీసులను అధికారులు మోహరించారు. ఈ సంవత్సరం మదురై జిల్లాలో జరిగే జల్లికట్టు పోటీల్లో పాల్గొనడానికి 15,047 ఎద్దులు, 5,234 మంది పోరాట యోధులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. 2025 కంటే కంటే ఈ సంవత్సరం 2,415 ఎద్దులు, 735 మంది యోధులు ఎక్కువగా నమోదు చేసుకున్నారని మదురై జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు.


# సికింద్రాబాద్ బచావో'

## నగరంలో పొలిటికల్ వార్..

**టీ మీడియా, జనవరి 17 ,సికింద్రాబాద్:**
చుట్టూ రాజకీయ రగడ రాజుకుంది. సికింద్రాబాద్‌కు ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్‌కు మద్దతుగా 'సికింద్రాబాద్ బచావో' పేరుతో ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. అయితే ఈ ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ వద్ద బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోగా, ర్యాలీ నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జాయింట్ సీపీ హెచ్చరించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొందిఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌కు ఎంతో గొప్ప చరిత్ర ఉందని ఆయన గుర్తుచేశారు. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని తొలగించే విధంగా ప్రస్తుతం ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. గతంలో పుస్తకాల్లో తుగ్లక్ గురించి చదివామని, కానీ ఇప్పుడు ప్రత్యక్షంగా తుగ్లక్ ఎలా ఉంటాడో చూస్తున్నామని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేపట్టిన తొలి పని తెలంగాణను టీఎస్ నుంచి టీజీగా మార్చడమేనని, దీని వల్ల ఏ పేదవాడికి న్యాయం జరిగిందో తనకు తెలియదని అన్నారు. తెలంగాణ తల్లిని తొలగించి కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చి పెట్టారని ఆరోపించారు. సికింద్రాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉండాలని, దాన్ని కాపాడేందుకే బీఆర్ఎస్ ఈ ఉద్యమానికి పిలుపునిచ్చిందని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజలు ఆలోచించాలని, సికింద్రాబాద్ అస్తిత్వ పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# కాంగ్రెస్‌కు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాజీనామా


**టీ మీడియా, జనవరి 17 ,మంచిర్యాల :**



మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి పార్టీలో ఒంటెద్దు పోకడలు, ఏకపక్ష నిర్ణయాలు, నియంత పరిపాలన తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొంటూ కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. త్వరలో తాను అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు రాజిరెడ్డి ప్రకటించారు.ఈ సందర్భంగా రాజీనామాకు గల కారణాలను లేఖ ద్వారా వివరించారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, చెన్నూర్ మేనిఫెస్టోకు ఆకర్షితుడినై గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ , స్థానిక శాసన సభ్యుడు గడ్డం వివేక్ విజయానికి విశేష కృషి చేశానని తెలిపారు. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీలో ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని ఆరోపించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తీవ్రమైన ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు.మంత్రి వివేక్ చెన్నూరు నియోజకవర్గానికి ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోలో ఒక్క హామీని నెరవేర్చ లేదని దుయ్యబట్టారు. దీనికి తోటు నియోజకవర్గంలో 45 వేల మంది యువకులకు ఉద్యోగాలు, మైనింగ్ ఇన్స్టిట్యూట్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, అగ్రిరీసెర్చ్ సెంటర్, అగ్రికల్చర్ మినీ యూనివర్సిటీ, కరకట్టల నిర్మాణం హామీ ముందడుగు పడలేదని వెల్లడించారు.ఎమ్మెల్యే వివేక్‌పై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత, వివేక్ విడుదల చేసి మోసపూరిత మేనిఫెస్టోతో ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోవడంతోనే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.

# దేశ రాజధానిని కమ్మేసిన పొగమంచు..

**టీ మీడియా, జనవరి 17 ,ఢిల్లీ :**



దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశం మొత్తం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం తొమ్మిది గంటలు దాటినా సూర్యుడు కనిపించని పరిస్థితి నెలకొంది. విజిబిలిటీ తీవ్రంగా తగ్గిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో గాలిలో కాలుష్యం మరింత పెరగడంతో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 'వెరీ పూర్ణ స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో జిఆర్‌ఎపి-××× కింద ఆంక్షలను మళ్లీ అమలు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. నిర్మాణ కార్యకలాపాలపై పరిమితులు విధించడంతో పాటు, డీజిల్ వాహనాల వినియోగాన్ని నియంత్రిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా సెక్టర్-115 ప్రాంతంలో దట్టమైన పొగమంచు కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

# రోడ్డు ప్రమాదం.. ఇద్దరు టీచర్లు దుర్మరణం

**టీ మీడియా, జనవరి 17 ,తుంగతుర్తి :**




సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అరవపల్లి వద్ద వేగంగా వేగంగా వెళున్న ఓ కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు టీచర్లు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు హెడ్‌మాస్టర్లు తీవ్రంగా గాయపడ్డారు.వివరాల్లోకి వెళ్తే.. సంక్రాంతి సెలవుల అనంతరం పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో నల్గొండ నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు కారులో తుంగతుర్తిలోని స్కూల్‌కు బయల్దేరారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉండగా, ఇద్దరు పురుషులు ఉన్నారు. వీరు వెళ్తున్న కారు అరవపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కస్తూర్బా పాఠశాలలు ఎస్‌అబశ్రీశ్రీవోగా పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కల్పన అక్కడికక్కడే దుర్మరణం చెందింది. రావులపల్లి హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్న పోరెడ్డి గీతారెడ్డి, తుంగతుర్తి హెడ్‌మాస్టర్ అల్వాల ప్రవీణ్, అన్నారం హెడ్‌మాస్టర్ అల్వాల సునీత తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గీతారెడ్డి కూడా మరణించారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మావోయిస్టులు మరణం

**టీ మీడియా, జనవరి 17 ,బీజాపూర్:**



ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలోశనివారం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మరణించారని పోలీసులు తెలిపారు. జిల్లాలోని వాయువ్య ప్రాంతంలోని అటవీ కొండల్లో ఉదయం వేళ కాల్పుల ఘటన చోటుచేసుకుందని ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఆ ప్రాంతంలో మావోయిస్టు కార్యకర్తలు ఉన్నారనే సమాచారం ఆధారంగా భద్రతా బలగాల సంయుక్త బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ నిర్వహిస్తున్నప్పుడు ఈ ఘటన జరిగిందని ఆయన చెప్పారు. ఇప్పటివరకు ఆ ప్రదేశం నుండి ఇద్దరు నక్సలైట్ల మృతదేహాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం అక్కడ అడపాదడపా కాల్పుల మార్పిడి జరుగుతోందని, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. జనవరి 3వ తేదీన, బీజాపూర్ సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ ప్రాంతంలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో ఏకంగా 14 మంది నక్సలైట్లు హతమయ్యారు. గత సంవత్సరం ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏకంగా 285 మంది నక్సలైట్లు మరణించారు. వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం మార్చి 31ని గడువుగా నిర్దేశించిన విషయం తెలిసిందే.

# మేడారంలో కేబినెట్ భేటీ..

## -ఏర్పాట్లను పరిశీలించిన సీతక్క



**టీ మీడియా, జనవరి 17 ,మేడారం :** జనవరి 18న మేడారంలో జరగనున్న క్యాబినెట్ సమావేశంకోసం చేసిన ఏర్పాట్లను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కసమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా ఖమ్మం వెళ్లి కొన్ని కార్యక్రమాలలో పాల్గొని, ఆ తర్వాత మేడారం చేరుకుంటారు. అక్కడ 'గద్దెల' సమీపంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని, అనంతరం హరిత హెూటల్‌లో జరిగే క్యాబినెట్ సమావేశానికి హాజరవుతారు.మరుసటి రోజు, ఆయన ఆలయంలో రూ. 251 కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త తోరణాలు, గ్రానైట్ కట్టడాలు, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. క్యాబినెట్ సమావేశంలో పాల్గొనే వారిలో అధిక శాతం మంది అధికారులే ఉన్న 300 మందికి పైగా వ్యక్తుల కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అధికారులకు వసతి కల్పించడం కోసం పరిపాలనా యంత్రాంగం ఇప్పటికే ములుగు, గోవిందరావుపేట, రామప్ప దేవాలయం మరియు లక్కవరంలో హెూటళ్లు, గెస్ట్ హౌస్‌లను బుక్ చేసింది. ఇక పోలీసు శాఖ కూడా ఈ సమావేశం కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది.

# పురుషులకూ ఉచిత బస్సు ప్రయాణం

**టీ మీడియా, జనవరి 17 ,చెన్నై:**



అన్నాడీఎంకే పార్టీ తమిళనాడులో పురుషులకూ ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇచ్చింది. పళనిస్వామి శనివారం నాడు ఎన్నికల తొలి మేనిఫెస్టోను ప్రకటించారు. మహిళలకు ప్రతినెలా రూ. 2 వేల ఆర్థికసాయం చేయనున్నట్లు తెలిపారు. అమ్మ ఇల్లం పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో సొంతఇల్లు లేని వారికి ఇల్లు ఇస్తామని సూచించారు. భూమి కొనుగోలు చేసి ప్రభుత్వమే ఇల్లు నిర్మిస్తుందని అన్నాడీఎంకే హామీ ఇచ్చింది. పట్టణాల్లో అర్హులకు అపార్ట్ మెంట్లు నిర్మించి ఇస్తామని పేర్కొంది. ఉపాధి పతాకాన్ని 150 రోజులకు పెంచుతామని పళనిస్వామి స్పష్టం చేశారు.

# ఎమర్జెన్సీ ల్యాండింగ్.. తప్పిన పెనుప్రమాదం

**టీ మీడియా, జనవరి 17 ,హైదరాబాద్:**



హాట్ ఎయిర్ బెలూన్‌ఉత్సవంలో ఒక పెను ప్రమాదం తప్పింది. గోల్కొండ గోల్ఫ్ క్లబ్ నుండి ముగ్గురు ప్రయాణికులతో బయలుదేరిన ఒక హాట్ ఎయిర్ బెలూన్, సాంకేతిక సమస్య కారణంగా ఇబ్రహీం బాగ్ సరస్సుసమీపంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. నివేదికల ప్రకారం, బెలూన్ గాలి మధ్యలో సాంకేతిక లోపం ఎదుర్కొంది. దీని ఫలితంగా వాయు పీడనం క్రమంగా తగ్గింది. దీని వలన పైలట్ కష్టతరమైన భూభాగం ఉన్నప్పటికీ, సరస్సుకు దగ్గరగా ఉన్న బురద ప్రాంతంలో బెలూన్‌ను సురక్షితంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ప్రయాణీకులందరూ ఎటువంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం యూరోపియన్ దేశాల నుండి వచ్చిన 15 అంతర్జాతీయ ప్రమాణాల హాట్ ఎయిర్ బెలూన్లతో జనవరి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఉత్సవాన్ని నిర్వహిస్తోంది.




# ఇండిగోకు కేంద్రం షాక్..

## -భారీ జరిమానా విధింపు

**టీ మీడియా, జనవరి 17 ,ఢిల్లీ బ్యూరో :**గతేడాది డిసెంబర్ నెలలో ఇండిగో విమానాల రద్దు సంక్షోభం తలెత్తింది. అయితే, దీనికి చర్యగా కేంద్రం ఇండిగోకు భారీ షాక్ ఇచ్చింది. రూ. 22 కోట్ల జరిమానా విధించింది. గతేడాది తలెత్తిన సంక్షోభం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 3 నుంచి 5 వరకు దేశవ్యాప్తగా ఇండిగో విమానాల రద్దు కొనసాగింది. 2507 విమానాలు రద్దు కావడంతో పాటు 1852 విమానాలు ఆలస్యంగా నడిచాయి. దేశవ్యాప్తంగా వివిధ ఎయిర్‌పోర్టుల్లో 3 లక్షల మంది ప్రయాణికులు నిలిచిపోయారు. దీనిపై డీజీసీఏ నలుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. విచారణ తర్వాత, కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇండిగోపై కేంద్రం చర్యలకు ఉపక్రమించిందిఆ సమయంలో విమాన కార్యకలపాలను, సంక్షోభ నిర్వహణపై తగినంత పర్యవేక్షల లేకపోవడంపై ఇండిగో సీఈఓకు కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. సవరించిన నిబంధనల ప్రభావాన్ని అంచనా వేయడంలో విఫలమైనందుకు ఇండిగోపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా ఈ రూ. 22.20 కోట్ల జరిమానాతో పాటు నియంత్రణ ఆదేశాలు, దీర్ఘకాలిక వ్యవస్థాగత దిద్దుబాటుకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడానికి ఇండిగో రూ. 50 కోట్ల బ్యాంక్ గ్యారెంటీని అందించాలని కేంద్రం ఆదేశించింది. ఆరు వేర్వేరు నిబంధనల కింద ఉల్లంఘనలకు విమానయాన సంస్థ రూ. 1.8 కోట్ల ఒకేసారి జరిమానా చెల్లించాలని కూడా ఆదేశించబడింది, ప్రతి ఉల్లంఘనకు రూ. 30 లక్షల జరిమానా విధించబడుతుంది.

# ఓడిపోయిన పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి

## ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ

**టీ మీడియా, జనవరి 17 హైదరాబాద్:**



ముంబై, మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ సత్తా చాటింది. పశ్చిమ రాష్ట్రాలైన ముంబైతోపాటు మరాఠ్వాడాలోని వివిధ మున్సిపల్ కార్పొరేషన్లలో 125 మంది అభ్యర్థులను కార్పొరేటర్లుగా ఎన్నుకున్నందుకు మహారాష్ట్ర ప్రజలకు ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని అసదుద్దీన్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల విజయంపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఒవైసీ మాట్లాడుతూ... తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎంఐఎం పార్టీ సిద్ధమవుతోందని, ఆసక్తిగల అభ్యర్థుల పేర్లను పార్టీ ఇప్పటికే కోరిందని వెల్లడించారు.ప్రస్తుతం తమను దుర్వినియోగం చేసే పార్టీలు తమ గురించి ఆలోచించాలని, ఇది ప్రజల నిర్ణయమన్నారు. విజయానికి చాలా మంది తొండుంటారని, ఓటమికి ఎవరూ ఉండరని చెప్పారు. మనం ఎందుకు ఓడిపోయాము? ఆ గొప్ప వ్యక్తులు చెప్పాల్సి ఉంటుందన్నారు. ఓటర్ల జాబితా విషయానికొస్తే, అది సరైనదేనని ఒవైసీ వెల్లడించారు. రాష్ట్రంలోని ముస్లిం ఓటర్లు కాంగ్రెస్, ఎన్సీపీలను తిరస్కరించి ఎంఐఎం వైపు మొగ్గుచూపారని తాజా ఎన్నికల ఫలితాలతో స్పష్టమైందని ఒవైసీ తెలిపారు. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో అధికార కూటమి హవా కొనసాగింది.

# మాజీ మంత్రి భీమన్న ఖండ్రే కన్నుమూత

**టీ మీడియా, జనవరి 17 ,బెంగుళూరు :**



మాజీ మంత్రి భీమన్న ఖండ్రే102 సంవత్సరాల వయస్సులో వయస్సు సంబంధిత సమస్యల కారణంగా మరణించారని ఆయన కుమారుడు, కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కళ్యాణ కర్ణాటక ప్రాంతానికి చెందిన సహకార రంగ దిగ్గజం శుక్రవారం రాత్రి తన నివాసంలో మరణించారు. ఆయనకు ఈశ్వర్ ఖండ్రేతో సహా ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరశైవ లింగాయత్ సంఘం నాయకుడు భీమన్న ఖండ్రే వీరప్ప మొయిలీ మంత్రివర్గంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా పనిచేశారు.అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే తెలిపిన వివరాల ప్రకారం, ఆ సీనియర్ నాయకుడు వయస్సు సంబంధిత ఆరోగ్య సమస్యలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల కారణంగా గత 10 నుండి 12 రోజులుగా అనారోగ్యంతో ఉన్నారు. మొదట ఆయనకు బీదర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు, ఆ తర్వాత భాల్కిలోని ఆయన నివాసంలో చికిత్స కొనసాగించారని పేర్కొన్నారు.న్యాయవాదిగా శిక్షణ పొందిన ఖండ్రే, స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే ప్రజా జీవితంలోకి అడుగుపెట్టారు. 1953లో ఆయన భాల్కి మున్సిపాలిటీకి తొలి ఎన్నికైన అధ్యక్షుడిగా నిలిచారు. 1962లో శాసనసభకు ఎన్నికైనప్పుడు ఆయన రాష్ట్ర స్థాయి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. సంవత్సరాలుగా, ఆయన నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు శాసనమండలి సభ్యుడిగా పనిచేశారు. ఈ ప్రాంతంలో సహకార రంగాన్ని బలోపేతం చేయడంలో ఖండ్రే కీలక పాత్ర పోషించారు. ఆయన హల్లిఖేడలోని బీదర్ సహకార చక్కెర కర్మాగారం, హుంజీలోని మహాత్మా గాంధీ చక్కెర కర్మాగారానికి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్నారు. నారంజా, కరంజా వంటి నీటిపారుదల ప్రాజెక్టుల అభివృద్ధికి కూడా ఆయన దోహదపడ్డారు. ఈ నీటిపారుదల ప్రాజెక్టులు రైతులకు ప్రయోజనం చేకూర్చాయని మంత్రి ఈశ్వర్ ఖండ్రే వెల్లడించారు.